# రైటర్

సుబ్బలక్ష్మికి అదేమిటోగానీ రచయితలంటే గొప్ప పిచ్చి, అభిమానం. వారంటే పడి చచ్చిపోతుంది. మార్కెట్‌లోకి ఏ రచయిత నవల వచ్చినా ఆమే మొట్టమొదటగా కొని చదువుతుంది. రచయితలమీద ఆమెకు ఎందుకు అంత అభిమానం అంటే కారణం చెప్పలేం.

అసలు సృష్టిలో రచయితలు కట్నాలు తీసుకోరు. భార్యలను కిరోసిన్ పోసి తగులబెట్టరు. వారిని చంపెయ్యరు. సుఖంగా చూస్తారు. వారు రచనలలోలాగే నిజజీవితంలోకూడా అలాంటి ఆదర్శాలే ఆచరణలో నింపివుంటాయి. అందుకే అనుకొంటాను ఆమెకు వారు అంటే మక్కువఎక్కువ.

సుబ్బలక్ష్మికి పెళ్ళిచూపులుఏర్పాటుచేసారు. వచ్చినతను రైటర్‌ట. తల ఎత్తి చూసి వెంటనే పెళ్ళికి ఒప్పేసుకొంది. ఓహ్! రచయితతో తన పెళ్ళి అని మురిసిపోయింది. ఈ సంబంధం నిశ్చయంకావాలని దేవుళ్ళకు మొక్కుకుంది. ఆమె అదృష్టమేమో సుబ్బలక్ష్మి వారికి నచ్చింది. పెళ్ళి అయిపోయింది.

తొలిరేయి భర్తపక్కనచేరింది. డైరెక్టుగా అడిగేసింది... "మీరు రైటర్‌ట కదా! ఎన్ని కథలు రాసారు? ఎన్ని నవలలు రాసారు? ఎన్ని రాస్తున్నారు?" అని.

అతడు ఒక్కక్షణం తెల్లబోయాడు. మరుక్షణం ఏదోచెప్పాడు. అంతే!! సుబ్బలక్ష్మి ఏడుస్తూ తలుపులు తీసుకొని వాళ్ళ నాన్నగారిదగ్గరకు వచ్చేసింది.

"ఏమయిందమ్మా?" గాభరాగా అడిగాడు ఆయన.

"నేను మోసపోయాను నాన్నా... ఆయన రైటర్ అనీ, కథలు అవీ రాస్తాడనీ నేను పెళ్ళికి ఒప్పుకున్నాను..."

"అవునమ్మా..."

"ఆయన కథలురాసే రైటర్ కాదట.. పోలీస్ స్టేషన్లో రైటరట..."

సుబ్బలక్ష్మి తండ్రి నిశ్చేష్టుడై చూస్తూండిపోయాడు అలా.

—నగేష్

# టకాల్... టకాల్... ఢమాల్... ఢమాల్

"పిన్నిగారూ!" గోడ పక్కనుంచి పిలుపు విని రావడంతో అంట్లుతోముతున్న వర్ధనమ్మ తల పైకెత్తిచూసింది. గోడ అవతల నుంచి కామాక్షమ్మ తలమాత్రం కనబడుతోంది. మళ్ళీ ఏ కాఫీపొడో అనుకుంటూ లేచి దగ్గరకెళ్ళింది. కామాక్షమ్మ హఠాత్తుగా గొంతు తగ్గించి "ఉదయం ఆటకెళదాం! వస్తారా? రాజమ్మకూడా వస్తోంది." అన్నది. వర్ధనమ్మ కళ్ళు మెరిసాయి. కాస్త తటపటాయించి "పనిమనిషి రాలేదీపూట. ఆయనయితే ఆఫీస్ కెళ్ళిపోయారు కానీ ఇంకా పిల్లముూక ఉంది. వాళ్ళు కాలేజీలకి, స్కూళ్ళకు వెళ్ళేదాకా చంపుకుతింటారు. ఈ అంట్లు చూస్తున్నారుగా! ఇంతకీ ఏసినిమా?" అన్నది.

"మరోచరిత్ర! ఇదివరకు చూడలేదు. ఈ షోకొస్తే తప్పకుండా చూద్దామనుకున్నాం గదా మొన్న. ఈరోజు పేపరు చూస్తే కనబడ్డది." అన్నది కామాక్షమ్మ.

"ఆ! అలాగా! అయితే తప్పకుండా వస్తాను" అంది వర్ధనమ్మ.

* * *

అప్పటికే ఆ సినిమా దాదాపు అందరూ చూసి ఉండటంవల్లనేమో హాలు ఖాళీగావుంది. కామాక్షమ్మ బృందం కూర్చున్న బాల్కనీలో అక్కడక్కడ విసిరేసినట్టుగావున్నారు జనాలు. సినిమా మొదలయి అరగంట కావస్తోంది. హాలంతా చీకటిగావుంది. అప్పుడు ప్రవేశించింది హాల్లోకి ఒక జంట. చీకట్లో తడుముకుంటూ వచ్చి సరిగ్గా కామాక్షమ్మ బృందం ముందు వరుసలో కూర్చున్నారు. తెరపై ప్రేమికుల బాధలు, తల్లిదండ్రుల కట్టుబాట్లు చూస్తూ తెగ కామెంట్లు చేస్తున్నారు కామాక్షమ్మ, వర్ధనమ్మ. వింటూ చూస్తూంది రాజమ్మ. అదే సమయంలో ముందు సీట్లలో కూర్చున్న జంటపైబడింది వాళ్ళ దృష్టి.

"ఎక్కడా చోటులేనట్టు ఇక్కడేనా వీళ్ళ శృంగారం?"

"ఇంతకీ మొగుడూ పెళ్ళాలేనా?"

"మొగుడూ పెళ్ళాలయితే ఈ అవస్థ ఎందుకు?"

"చాటుమాటుగా వచ్చివుంటారు."


"ఖర్మ! అయినా వీళ్ళనని లాభంలేదు. వీళ్ళ తల్లిదండ్రులననాలి."

"కని లోకంమీదికి వదిలేసరా? కాస్త అడ్డు అదుపూ ఎందద్దూ!"

ష్!!! పక్కనున్న పెద్దావిడ కసరడంతో వీళ్ళ గుసగుసలు ఆపారు.

ఇంటర్‌వెల్ అయింది. లైట్లు గుప్పున వెలిగాయి. ముందు సీట్లలోని జంట లేచారు. వాళ్ళను చూసిన కామాక్షమ్మ అవాక్కయిపోయింది. ఆ అబ్బాయి ఆమె సుపుత్రుడు. వర్ధనమ్మ ముఖం వాలిపోయింది. ఆ పిల్ల ఆమె పుత్రికారత్నం. వీళ్ళని చూసిన ఆ జంట క్షణంలో మాయమయ్యారు. వీళ్ళందరిని గమనిస్తున్న రాజమ్మ మనసులో నవ్వుకుంది గుడివింద జ్ఞాపకం వచ్చి. ఇంటికెళ్ళేదాకా నోరుతెరిస్తే ఒట్టు. ఇంటికెళ్ళాకా ఏమయివుంటారా? ఏముంది మామూలే. ఇద్దరిళ్ళల్లోను టకాల్! టకాల్!! ఢమాల్! ఢమాల్!!

—అరసూర్ శ్యామసుందర్




### అద్దంముందు

మీరు ఎన్నో సినిమాల్లో అర్ధనగ్న నృత్యాలు చేస్తుంటారు కదా! కెమెరాముందు నటించే సమయంలో మీకేమని పిస్తుంటుంది?" అడిగాడు విలేఖరి.

"అర్ధరాత్రి అద్దంముందు వస్త్ర విహీనంగా నిలుచున్నట్లుంటుంది." అంది నగ్నసుందరి.

—కె. త్రివిక్రమరావు (తెనుపూరు)